క్లుప్తంగా

పశుగణన వేగవంతం



పశుగణన సర్వేను పరిశీలిస్తున్న డాక్టర్ దీనకుమార్

సీతానగరం: పశుసంవర్ధక శాఖ సీతానగరం సబ్ డివిజన్ పరిధిలో ఉన్న బలిజిపేట, సీతానగరం మండలాల్లో జరుగుతున్న పశుగణన పనులు వేగవంతం చేయాలని అగ్రికల్చర్ అసిస్టెంట్ డైరెక్టర్ దీనకుమార్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం పెదభోగిలిలో జరిగిన పశుగణన కార్యక్రమాన్ని పరిశీలించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ రెండు మండలాల్లో మండల పశు వైద్యాధికారుల పర్యవేక్షణలో సిబ్బంది సర్వే నిర్వహిస్తున్నారని, ఇప్పటివరకు 30 శాతం ప్రక్రియ జరిగిందని తెలియజేశారు. మిగతా 70 శాతం పశుగణన చేయాలన్నారు. ఈ ప్రక్రియ వేగవంతం చేసి ఆన్‌లైన్‌లో పొందుపరచాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ ఎస్.రామారావు పాల్గొన్నారు.

మామిడిపల్లి ఆశ్రమ పాఠశాల తనిఖీ



ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న మండల స్పెషల్ ఆఫీసర్ వై.సత్యం నాయుడు

సాలూరు రూరల్: మండలంలోని మామిడిపల్లి బాలికల ఆశ్రమ పాఠశాలను డీఆర్‌డీఏ ఏపీడీ, సాలూరు మండల స్పెషల్ ఆఫీసర్ వై. సత్యం నాయుడు శుక్రవారం పరిశీలించారు.గ్రామ సందర్శనలో భాగంగా ఆయన ఆశ్రమ పాఠశాలతో పాటు అంగన్‌వాడీ కేంద్రాన్ని, గ్రామ సచివాలయాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆశ్రమ పాఠశాలలో చదువులో వెనకబడిఉన్న 10 వ తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు చెప్పాలని ఉపాధ్యాయ సిబ్బందికి సూచించారు. అలాగే అంగనవాడీ కేంద్రంలో పిల్లలకు పౌష్టికాహారం ఏమేరకు అందుతోందో అడిగి తెలుసుకున్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటు



పి.కోనవలస చెక్ పోస్ట్ వద్ద ఏర్పాటు చేస్తున్న సీసీ కెమెరా

పాచిపెంట: మండలంలోని పి.కోనవలస చెక్ పోస్ట్ వద్ద అదనంగా మరో రెండు సీసీ కెమెరాలు శుక్రవారం ఏర్పాటు చేసినట్లు పాచిపెంట ఎస్సై వెంకట సురేష్ తెలిపారు. వీటి ద్వారా అనుమానాస్పదంగా సంచరించే వాహనాలను గుర్తించి, గంజాయి, సారా వంటి మాదకద్రవ్యాల నియంత్రణ చేపట్టనున్నట్లు తెలిపారు. అలాగే రాత్రి సమయాల్లో ఘాట్ రోడ్ లో ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యల్లో భాగంగా ప్రతి వాహనం ఆపి డ్రైవర్ ముఖం కడుక్కున్న తర్వాత వాహనాలను పంపించనున్నామని చెప్పారు.

తూనికలు కొలతల అధికారుల తనిఖీలు



దుకాణాలను పరిశీలిస్తున్న తూనికలు కొలతల శాఖ ఇన్‌స్పెక్టర్ కె.రత్నరాజు

సాలూరు: పట్టణంలోని పెదబజారులో తూనికలు కొలతల శాఖ ఇన్‌స్పెక్టర్ కె.రత్నరాజు శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పెద్దబజారులో చేపలు, కోళ్ల మాంసం దుకాణాలను పరిశీలించారు. అక్కడ వినియోగిస్తున్న కాటాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అందరూ ఎల్రక్టిక్ కాటాలనే వాడాలని స్పష్టం చేశారు. తూకాల్లో అక్రమాలకు పాల్పడిన ఇద్దరిపై కేసులు నమోదుచేశారు. వ్యాపారులు ఎక్కడైనా ఎంఆర్‌పీ కంటే ఎక్కువకు వినియోగిస్తే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



మడుల్లో వరిచేను కుప్పలు వేస్తున్న రైతు కూలీలు

ఆందోళనలో అన్నదాత

- తుఫాన్ హెచ్చరికతో బెంబేలు
- వర్షం పడుతున్నా పంట మోస్తూ పరుగులు
- కూలీలు దొరక్క మడుల్లోనే కోసిన చేలు

సాలూరు రూరల్:

రైతుకు ఎప్పుడు ఏకష్టం వస్తుందో తెలుసుకోవడం ఎవ్వరి వల్ల కాదన్నది జగమెరిగిన సత్యం. ఆరుగాలం కష్టించి పండించిన పంట ఇంటికి చేరినంతవరకు దేవుడి మీద భారం వేసే రైతు కాలం గడుపుతాడనడంలో సందేహం లేదు. ఈ ఏడాది సాలూరు మండలంలో వరిపంట కొంత ఆశాజనకంగానే పండింది. ఇంతవరకు వాతావరణం అనుకూలించడంతో వరిపంట అనుకున్న స్థాయిలో పండినట్లు రైతులు చెబుతున్నారు.



ధాన్యం తడవకుండా టార్పాలిన్లు కప్పుతున్న రైతు

అయితే ఇప్పటివరకు మండలంలో 30 శాతం మంది రైతులు తమ ధాన్యాన్ని ఇళ్లకు చేర్చుకున్నారు. ప్రస్తుతం కోతలు కోసి మడుల్లోనే ఉన్న వరిచేలను తుఫాన్ హెచ్చరికతో ఎప్పుడు తెల్లవారుతుందో తమ చేలు కుప్పలు వేసుకుందామని రైతులు ఎదురు చూశారు.



మడుల్లోనే ఉన్న కోసిన వరిచేలు

చిరుజల్లులతో రైతుల ఆందోళన

పార్వతీపురం: చేతికి పంట అందుతుందన్న తరుణంలో వాయుగుండం కారణంగా చిరుజల్లులు కురవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. చిరుజల్లులు, మబ్బులతో కోసిన వరిచేలు తడిసిపోవడంతో ధాన్యం మిల్లింగ్‌కు తరలించలేకపోతున్నామని వాపోతున్నారు. మండలంలోని వెంకంపేట, చినబొండపల్లి, పెదబొండపల్లి, జమదాల, తాళ్లబురిడి తదితర గ్రామాల్లో చిరుజల్లులు కురవడంతో పంటలను కాపాడుకునేందుకు రైతులు నానా అవస్థలు పడుతున్నారు.

శుక్రవారం కూలీలు దొరికిన రైతులు తమ చేలు కుప్పలు పెట్టేందుకు పరుగులు తీశారు. ఒక వైపు వర్షం తుంపర్లు పడుతున్నప్పటికీ రైతులు, రైతు కూలీలు పరుగుపరుగున వరి చేను మోసి కుప్పలు పెట్టారు. ఇలాంటి పరిస్థితుల్లో మరికొంత మంది రైతులు నూర్చిన ధాన్యాన్ని ఆరబెట్టాల్సి ఉండగా వర్షం భయంతో ఆరుబయటే టార్పాలిన్లు తెచ్చుకుని ధాన్యంపై కప్పుకున్నారు. చిన్న వర్షం అయితే పరవాలేదు కాని పెద్ద వర్షం పడితే ధాన్యం తడిసిపోయే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అలాగే మరికొంతమంది రైతులు కోసిన చేలు పొలంలోనే ఉండిపోవడంతో తుఫాన్ రూపంలో తమ కష్టమంతా ఎక్కడ నీటిపాలవుతుందోనని పొలం గట్లపైనే కూర్చుని విచారిస్తున్నారు. ఇలా మండలంలోని వరి రైతుల పరిస్థితి దీనంగా మారిపోయింది.

సచివాలయాల్లో సిబ్బందిని అందుబాటులో ఉంచాలి

- ఎంపీడీఓకు వినతిపత్రం

బలిజిపేట: సచివాలయాల్లో సిబ్బందిని అందుబాటులో ఉంచాలని నారాయణపురం గ్రామానికి చెందిన నాయకులు ఎంపీడీఓ విజయలక్ష్మికి శుక్రవారం వినతిపత్రం అందజేశారు. నారాయణపురం గ్రామంలో ఇటీవల ప్రజలు సచివాలయం పని నిమిత్తం అక్కడికి వెళ్లగా డిజిటల్ అసిస్టెంట్, వీఆర్వో, సర్వేయర్ అందుబాటులో లేరని పేర్కొన్నారు. వివిధ రకాల ప్రజలు వారి అవసరాల నిమిత్తం సచివాలయానికి వెళ్తుంటారని ఆసమయంలో సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. మండలంలోని అన్ని సచివాలయాల్లో రెగ్యులర్ ఉద్యోగులను ఉంచాలని కోరారు. కార్యక్రమంలో జి.సత్యనారాయణ, ఎం.పెదపాపినాయుడు, పి.ప్రసాద్, కె.పకీరునాయుడు, పి.కన్నబాబు తదితరులు పాల్గొన్నారు.



ఎంపీడీఓకు వినతి పత్రాన్ని అందిస్తున్న నాయకులు

గ్రామాల్లో పారిశుధ్య పనులు నిర్వహించాలి

సీతానగరం: మండలంలోని అన్ని గ్రామాల్లో హౌస్‌హోల్డ్ సర్వే నిర్వహించడంతో పాటు పారిశుధ్య పనులు చేపట్టడానికి కార్యదర్శులు కృషి చేయాలని ఎంపీడీఓ పి.త్రివిక్రమ రావు కోరారు. ఈ మేరకు శుక్రవారం ఆయన మండలంలోని కోట సీతారాంపురం, రంగంపేట, పణుకుపేట గ్రామాల్లో జరుగుతున్న సర్వే, పారిశుధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వాతావరణం చల్లబడడంతో దోమలు విజృంభించకుండా తీసుకుంటున్న ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా పారిశుధ్య పనులు నిర్వహించి, కాలువలలో పూడికలు తీయించాలని సూచించారు. సర్పంచ్‌ల పర్యవేక్షణలో ప్రారంభించిన అభివృద్ధి పనులు పూర్తి చేయాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో కార్యదర్శులు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.



పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ త్రివిక్రమరావు

పెళ్లి బాజాకు వేళాయె..:



- డిసెంబర్‌లో అధికంగా వివాహాలు

పార్వతీపురం: వివాహం జీవితంలో కీలక ఘట్టం. తమ పిల్లల వివాహాలను అత్యంత వేడుకగా నిర్వహించాలని తల్లిదండ్రులు ఆరాట పడుతుంటారు. ఈ క్రమంలో డిసెంబర్‌లో మంచి ముహూర్తాలు ఉండడంతో పెళ్లి ఏర్పాట్లతో వధూవరుల కుటుంబాలు ఉరుకులు, పరుగులు పెడుతున్నాయి. నగలు, వస్త్రాలు, కల్యాణ మంటపాలు, సన్నాయి మేళం, కేటరింగ్‌కు డిమాండ్ పెరిగింది.

మార్గశిర మాసంలో మంచి రోజులు

ఈ ఏడాది మార్గశిర(డిసెంబర్)మాసంలో మంచి ముహూర్తాలు ఉండడంతో పెళ్లిళ్లు చేసుకునేందుకు వధూవరులు ఆసక్తి చూపుతున్నారు. మార్గశిర మాసంలో బలమైన ముహూర్తాలు ఉండడంతో పాటు జనవరిలో పుష్యమాసం కావడం, మార్చి 2వ వారం నుంచి శుక్రమూఢం రానుండడంతో ఇప్పుడున్న ముహూర్తాల్లోనే వివాహాలు చేయాలని పెద్దలు ఆరాటపడుతున్నారు. డిసెంబర్ 2 నుంచి మార్గశిర మాసం ప్రారంభం కావడంతో వివాహాలు అధిక సంఖ్యలో జరగనున్నాయి. డిసెంబర్ 4, 7, 10 తేదీల్లో మంచి ముహూర్తాలు ఉండడంతో పెళ్లిళ్లు చేసుకునేందుకు సిద్ధమవుతున్నారు. అలాగే డిసెంబర్ 11, 14, 20, 22, 24 , 25 తేదీల్లో పెళ్లిళ్లతో పాటు వివిధ శుభకార్యక్రమాలకు మంచి ముహూర్తాలు ఉన్నట్లు పురోహితులు చెబుతున్నారు.

అదనపు తరగతి గదుల ప్రారంభం

పాచిపెంట: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం సమీపంలో ఉన్న గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో గత ప్రభుత్వ హయాంలో రూ.1.75 కోట్లతో నిర్మాణం చేపట్టిన అదనపు తరగతి గదులను గిరిజన సంక్షేమ, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అదనపు గదుల ప్రారంభంతో విద్యార్థినులకు మౌలిక వసతుల సమస్య తొలగుతుందన్నారు. విద్యార్థినులతో కలిసి మంత్రి థింసా నృత్యం చేశారు. మంత్రి వెంట టీడీపీ నాయకులు గుడేపు యుగంధర్, పల్లేడ ఉమామహేశ్వరరావు, కోరిపల్లి సురేష్ ఉన్నారు.



అదనపు తరగతి గదులు ప్రారంభిస్తున్న మంత్రి సంధ్యారాణి

భద్రతా నియమాలు పాటించాలి



వాహనాలు తనిఖీ చేస్తున్న ఏఎస్సై శ్రీనివాసరావు

మక్కువ:

వాహన చోదకులు భద్రతా నియమాలు పాటించాలని ఏఎస్సై శ్రీనివాసరావు కోరారు. ఈ మేరకు స్థానిక శ్రీదేవి కాలనీ మూడు రోడ్లు కూడలిలో శుక్రవారం వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనదారులు రహదారి భద్రత నియమాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ఆటోలలో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అక్రమంగా మద్యం, సారా వాహనాల్లో తరలిస్తే సీజ్ చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

600 సారా ప్యాకెట్ల పట్టివేత



పట్టుకున్న సారా ప్యాకెట్లు చూపిస్తున్న సీఐ అప్పలనాయుడు

సాలూరు: పట్టణంలోని ఎరుకుల వీధి జంక్షన్‌లో నలుగురు మహిళల నుంచి 600 సారా ప్యాకెట్లు పట్టుకున్నట్లు సీఐ అప్పలనాయుడు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన మాట్లాడుతూ, ఒడిశాలోని పొట్టంగి బ్లాక్ లావిడికి చెందిన నలుగురు మహిళలు సారా ప్యాకెట్లు కలిగి ఉండడాన్ని గుర్తించి ప్యాకెట్లు వారి దగ్గర స్వాధీనం చేసుకుని కేసు నమోదుచేశామని తెలిపారు. మహిళలను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. ఎక్కడైనా సారా విక్రయాలు చేస్తే తగిన చర్యలు తీసుకోనున్నామని హెచ్చరించారు.

11లీటర్ల సారా స్వాధీనం

సాలూరు రూరల్: మండలంలోని దండిగాం కూడలి వద్ద రెండు ద్విచక్రవాహనాలతో తరలిస్తున్న 11 లీటర్ల సారాను రూరల్ పోలీసులు శుక్రవారం పట్టుకున్నారు. సాలూరుకు చెందిన కొర్రపండు, సంగిరెడ్డి గాసి అనే ఇద్దరు వ్యక్తులు రెండు స్కూటీలతో సారా తరలిస్తూ పట్టుబడ్డారు. సారాతో పాటు రెండు స్కూటీలను స్వాధీనం చేసుకుని నిందితులపై కేసు నమోదు చేసినట్లు హెచ్‌సీ బంగార్రాజు తెలిపారు.

మెగా పేరెంట్స్ డే ఘనంగా నిర్వహించాలి



మక్కువ: తరగతి గదులను పరిశీలిస్తున్న డీఈఓ ఎన్. తిరుపతి నాయుడు

మక్కువ: వచ్చే నెలలో జరపనున్న మెగా పేరెంట్స్ డేను ఘనంగా నిర్వహించాలని డీఈఓ ఎన్.తిరుపతి నాయుడు అన్నారు. ఈమేరకు స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆపార్ నమోదు వేగవంతం చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. 10వ తరగతి విద్యార్థులు శాతశాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. విద్యార్థులకు సులభతమైన బోధన చేపట్టాలని సూచించారు. పదవ తరగతి సిలబస్ త్వరగా పూర్తిచేసి ప్రీ పరీక్షలు నిర్వహించాలని కోరారు. అనంతరం తరగతి గదులు ను, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఎంఈఓ శ్యాంసుందర్ రావు,హెచ్‌ఎం హేమలత, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

లక్ష్యాలతో కూడిన విద్యనభ్యసించాలి

సాలూరు: విద్యార్థులు లక్ష్యాలతో కూడిన విద్యనభ్యసించి జీవితంలో ఉన్నతస్థాయికి ఎదగాలని డీఈఓ తిరుపతినాయుడు అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయన పట్టణంలో బాలికోన్నత పాఠశాల, డబ్బివీధి మున్సిపల్ హైస్కూల్‌ను సందర్శించారు. పాఠ్యాంశాల నుంచి విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగి వారి విద్యాసామర్థ్యాన్ని పరీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రణాళికాబద్ధంగా చదువుకోవడం ద్వారా ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని చెప్పారు. వచ్చే నెల 7న జరగబోయే మెగా పేరెంట్‌మీటింగ్‌కు విద్యార్థులు వారి తల్లిదండ్రులను భాగస్వాములను చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఆయన వెంట ఎంఈఓ రాజ్‌కుమార్ తదితరులు ఉన్నారు.



సాలూరు: విద్యార్థినులతో మాట్లాడుతున్న డీఈఓ తిరుపతినాయుడు

హౌస్ హోల్డ్ సర్వే పరిశీలన



సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీవో స్వరూప రాణి

మక్కువ:

మండల కేంద్రం మక్కువలో నిర్వహిస్తున్న హౌస్ హోల్డ్ సర్వేను ఎంపీడీవో డి.స్వరూప రాణి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ సచివాలయ సిబ్బందికి కేటాయించిన హౌస్ హోల్డ్‌సర్వేలో భాగంగా ఇంటిలో ఉన్న సభ్యులందరి సమాచారాన్ని ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచిస్తూ ఎప్పటికప్పుడు నివేదికను పంపించాలని కోరారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గిరిజన వర్సిటీని తరలిస్తే ఊరుకోం

సాలూరు: కేంద్రీయ గిరిజన యూనివర్సిటీను ఇప్పటికే శంకుస్థాపన చేసిన మెంటాడ మండలం కుంటినవలస వద్దనే నిర్మించాలని, వర్సిటీని కొత్తవలసకు తరలిస్తే ఊరుకునేది లేదని సీపీఎం జిల్లా కమిటీ ప్రభుత్వాన్ని హెచ్చరించింది. సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు ఎస్.వై.నాయుడు, శ్రీనువాస్ స్థానిక విలేకరులతో శుక్రవారం మాట్లాడారు. గిరిజనులకు చెంతనే గిరిజన వర్సిటీ ఉండాలన్న ఉద్దేశంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కుంటినవలస వద్ద 560 ఎకరాల్లో వర్సిటీ నిర్మాణానికి శంకుస్థాపన చేసిందన్నారు. దీనిని మరలా కొత్తవలసకు తీసుకెళ్లిపోతామంటూ అసెంబ్లీ సాక్షిగా విద్యాశాఖ మంత్రి లోకేశ్ ప్రకటించడాన్ని తప్పుబట్టారు. ఆ నిర్ణయాన్ని వెనుకకు తీసుకోకపోతే పార్వతీపురం మన్యం జిల్లాకు, ఈ ప్రాంత గిరిజనులకు తీరని ద్రోహం చేసిన వారవుతారన్నారు. మేధావులు, విద్యార్థులతో కలిసి ఐక్య ఉద్యమం తప్పదని హెచ్చరించారు. ఈ మేరకు వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకుడు సుందరరావు పాల్గొన్నారు.



గిరిజన వర్సిటీను గిరిజన ప్రాంతంలోనే నిర్మించాలంటూ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు

ఆ ఉత్తర్వులు వెనక్కి తీసుకోవాలి..

గుమ్మలక్ష్మీపురం: గిరిజన ఆశ్రమ పాఠశాల ఉపాధ్యాయులను గిరిజన గురుకుల పాఠశాలలకు డెప్యూటేషన్ వేస్తూ రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ అధికారులు ఇచ్చిన ఉత్తర్వులను తక్షణమే వెనక్కి తీసుకోవాలని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్ కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పది రోజులుగా శాంతియుతంగా పోరాడుతున్న వీరి సమస్యలను పరిష్కరించకుండా వారిని భయపెట్టి మరింత ఆందోళనకు గురిచేసే విధంగా ఉత్తర్వులు ఇవ్వడం ఏంటని ప్రశ్నించారు. ఎన్నికల ముందు అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను ఆదుకుంటామని, మేలు చేస్తామని హామీలు, వాగ్దానాలు ఇచ్చి ఇప్పుడేమో వారి ఉద్యోగాలకు ఎసరుపెట్టే చర్యలు ఏమిటని ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే ఇచ్చిన ఉత్తర్వులను వెనక్కి తీసుకుని వారి సమస్యలు పరిష్కారం చేయాలని లేకుంటే అన్ని గిరిజన, ప్రజా సంఘాలను కలుపుకుని గిరిజన శాఖ మంత్రి ఇంటి ఎదుట ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

పి.కోనవలసలో సాగని కెమిస్ట్రీ బోధన

- భర్తీకాని కెమిస్ట్రీ లెక్చరర్ పోస్టు

సాలూరు: విద్యార్థి జీవితంలో ఇంటర్మీడియట్ విద్య కీలకమైనది. భవిష్యత్తుకు దిశానిర్దేశం చూపేది కూడా అదే. అంతటి ప్రాధాన్యమున్న కళాశాల విద్యలో సబ్జెక్టు బోధించే అధ్యాపకుడు లేకపోతే ఆ కళాశాల విద్యార్థులందరికీ నష్టం తప్పదు. పోటీ పరీక్షల్లో వెనుకబాటుకు గురవుతారు. ప్రస్తుతం పాచిపెంట మండలం పి.కోనవలస గిరిజన గురుకుల బాలికల కళాశాలలో కెమిస్ట్రీ సబ్జెక్టు బోధించే అధ్యాపకుడు లేకపోవడంతో విద్యార్థులు ఆందోళనకు గురవుతున్నారు. ఇంటర్మీడియట్ రెండేళ్లు కలిపి సుమారు 156 మంది విద్యార్థినులు చదువుతున్నారు. మరికొద్ది నెలల్లో ఇంటర్మీడియట్ పరీక్షలు జరగనున్నవి. ఇప్పటివరకు కెమిస్ట్రీ అధ్యాపక పోస్టులను భర్తీ చేయకపోవడం విద్యార్థులకు శాపంగా మారింది. సబ్జెక్టు బోధన లేకపోవడంతో ఇటు అకడమిక్ పరీక్షలతో పాటు అటు పోటీపరీక్షలకు సిద్ధమవుతున్న బాలికలు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి కెమిస్ట్రీ లెక్చరర్‌ను కళాశాలకు నియమించాలని కోరుతున్నారు.



పి.కోనవలస గిరిజన గురుకుల బాలికల కళాశాల